


# కోర్టుల్లో క్యాంటీన్ కబుర్లు చెప్పకండి

### న్యాయవాదికి సుప్రీం చీఫ్ జస్టిస్ మందలింపు

**కోల్‌కతా, నవంబరు 7:** కోల్‌కతా వైద్యురాలి హత్యాచారఘటనకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం ప్రకటించింది. కేసు విచారణను పశ్చిమబెంగాల్ కాకుండా వేరే రాష్ట్రానికి బదిలీచేయాలంటూ దాఖలయిన పిటిషన్‌ను గురువారం సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. కేసు బదిలీకి న్యాయస్థానం నిరాకరించింది. పోలీస్, న్యాయవ్యవస్థపైరాష్ట్రప్రజలకు విశ్వాసం పోతోందని వ్యాఖ్యానించిన ఒక న్యాయవాదినిప్రధాన న్యాయమూరినత జస్టిస్ డివైచంద్రచూడ్ మందలించారు. కోర్టులో క్యాంటీన్ కబుర్లు చెప్పవద్దని అలాంటి జనరల్ స్టేట్‌మెంట్లు ఇవ్వవద్దని హెచ్చరించారు. మణిపూర్‌ఖవంటి కేసుల్లో బదిలీచేసామని, కానీ ఇక్కడ పరిస్థితి ఏమీ అలా లేదని, కాబట్టి ఆకేసును బదిలీచేయలేమని, ఇక ఈ కేసులో సిబిఐ దాఖలుచేసిన ఆరవ ప్రగతినివేదికను పరిశీలించామని, సిబిఐ విచారణసమయంలోఎమేం కేసు స్టేటస్ పరిశీలనకు దూరంగా ఉన్నామని అన్నారు. నాలుగు వారాల తర్వాత అప్‌డేట్ అయిన కొత్త నివేదికను దాఖలుచేయనివ్వండని పిటిషనర్‌కు చీఫ్‌జస్టిస్ సూచించారు. ఇక తర్వాత విచారణను సుప్రీంకోర్టు ఈనెల 11వ తేదీకి వాయిదా వేసింది.

# భారతీయులంటే విదేశీయులకు ఎంతో ప్రేమ, అభిమానం

### తెలంగాణలో పెట్టుబడులకు మంచి ఇండస్ట్రియల్ పాలసీ

### సిడ్నీలో మీట్ గ్రీట్, దీపావళి సంబురాల్లో పాల్గొన్న స్పీకర్, చైర్మన్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** ఆస్ట్రేలియా తెలంగాణ కమ్యూనిటీ ఆద్వర్యంలో సిడ్నీలోని ఉడ్ క్రాఫ్ట్ కమ్యూనిటీ సెంటర్‌లో గురువారం జరిగిన 'మీట్ గ్రీట్, దీపావళి సంబురాల్లో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజి స్లేచర్ సెక్రటరీ డా.వి. నరసింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రసంగిస్తూ.. భారతీయులు కష్ట జీవులు, తమ పని తాము చేసుకుని తాము అభివృద్ధి చెందదంతో పాటుగా తమను ఆదరించిన దేశ అభివృద్ధిలో కూడా భాగస్వామ్యం అవుతారు. అదే విధంగా మనవాళ్లు శాంత స్వభావులు, గొడవల జోలికి పోకుండా తమ పని తాము చేసుకుంటారు. అందుకే భారతీయులు అంటే ప్రపంచంలోని మిగితా దేశాల వారికి ప్రేమ, అభిమానం. నేడు ప్రపంచం చిన్నదైపోయింది. ఉద్యోగ, వ్యాపార అవకాశాల కోసం ప్రజలు ప్రపంచం నలుమూలల వెళ్తున్నారు.ఏ దేశ మేగినా ఎందుకాలిడినా పొగదరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము అన్నారు రాయప్రోలు సుబ్బారావు గారు ఎక్కడ ఉన్నా మనం భారతీయలం అనేది మన గుండెల్లో ఉంటుంది.క్రికెట్‌ను ప్రేమించే భారతీయ యువతకు ఆస్ట్రేలియాతో క్రికెట్ మ్యాచ్‌లు అంటే తెల్లవారుజామున మూడు గంటలకు ఆలారం పెట్టుకుని మరీ నిద్రలేచి చూస్తారు. తెలుగు ప్రజలు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయినా అభివృద్ధిలో అన్న దమ్ములలాగా ఉంటున్నారు.తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌తో పాటుగా కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలలో కూడా తెలుగు వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు.ఎక్కడ ఉన్నా తెలుగు వారందరూ ఒక్కరే, మనందరిదీ ఉమ్మడి కుటుంబం. తెలం గాణ రాష్ట్రంలో ఏం జరిగినా మీకు ఎక్కువ ఆసక్తి ఉంటుంది. స్వంత ప్రాంతంపై ప్రేమ, అభిమానం అట్లాగే ఉంటుంది.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు. మనమందరం రేవంత్ రెడ్డికి అండగా నిలబడాలి' అని సూచించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సాధ్యమైనంత వరకు అమలు చేయడానికి కష్టపడుతున్నారు.ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకున్నా ఉన్న వనరులను సక్రమంగా వాడి ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరంటు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పది లక్షలకు పెంపు అమలు చేశారు.దేశంలో ఎక్కడా లేని విదంగా రైతులకు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారు. ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. యువత కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు.అన్ని వర్గాల పేదల పిల్లలు ఒకే చోట చదువుకునే విదంగా ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడె న్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. మూసీ పునరుజ్జీవం, హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణ కోసం యుద్ధమే చేస్తున్నారుఇదంతా తెలంగాణ బంగారు భవిష్యత్తు కోసమే.తెలంగాణలో అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయి. పెట్టుబడులు పెట్ట డానికి మంచి ఇండస్ట్రియల్ పాలసి ఉన్నది.మీరు కూడా ఆస్ట్రేలియా రాజకీయాల్లో కీలకంగా ఎదగాలని కోరుకుంటున్నాను. నిన్న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయులు కీలక పాత్ర పోషించారు. ఆరుగురు సెనేటర్లుగా ఎన్ని కయ్యారని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వివరించి, సభికుల అనుమానాలను స్పీకర్, చైర్మన్ నివృత్తి చేశారు. రాజశేఖర్‌రెడ్డి మ న్యం, నవనీత్‌రెడ్డి కే, దేవిప్రసాద్ మేక, రవీం దర్‌రెడ్డి, శ్రీకాంత్ ఎ.డేవిడ్ రాజు తదితరులు తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, సెక్రటరీ చార్యులును సన్మానించారు.

# నాదేండ్ ఉత్తర నియోజకవర్గం పరిశీలకురాలిగా అస్మితహుస్సేన్

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** నాదేండ్ ఉత్తర నియోజకవర్గం పరిశీలకురాలుగా అస్మితహుస్సేన్‌ను నియమించినట్లు ఆలిండియా కాంగ్రెస్ కమిటి ఓబిసి డిపార్టుమెంట్ చైర్మన్ మాజీ హర్యానా ఆర్థిక మంత్రి అజయ్ సింగ్ యాదవ్ తెలిపారు. ఈమేరకు తెలంగాణ ఓబిసి డిపార్టుమెంట్ స్టేట్ కోఆర్డినేటర్ అస్మత్‌హుస్సేన్‌కు లేఖ పంపారు. నాందేడ్‌లో ఓబిసి ఓటర్లను ఆకట్టుకొనేందుకు అవసరమైన వ్యూహాలు చేయడానికి అక్కడ క్షేత్రస్థాయిలో పనిచేయడానికి పరిశీలకురాలుగా పంపుతున్నామని ఆయన తెలిపారు.

# భక్తుల సేవకు పునరంకితం

### టిటిడి బోర్డు సభ్యులుగా సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డి, కోటేశ్వరరావు ప్రమాణం



**తిరుమల,నవంబర్ 7ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సేవకులుగా సేవచేసే భాగ్యం కలగడం తమ అదృష్టంగా భావి స్తున్నామని టిటిడి బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డి, మునికోటేశ్వరరావుతెలిపారు. భక్తుల సేవకు పునరం కితం కావడం ఆనందంగా ఉందన్నారు. టిటిడి ధర్మకర్తలమండలి సభ్యులుగా నియమితులైన వీళ్ళు గురువారం ఉదయం ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ప్రమాణస్వీకారం చేయించారు. స్వామివారి దర్శనాంతరం బోర్డు సభ్యులకు, కుటుంబసభ్యులకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు.

### నాయిబ్రాహ్మణ ఆచార్యులను వైస్‌ఛాన్స్‌లర్లుగా నియమించాలి

**విజయవాడ,నవంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** నాయి బ్రాహ్మణ ఆచార్యులను వైస్ ఛాన్సలర్లుగా నియమించాలిఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సర్ నియామకం సందర్భంగా సమాజంలో అత్యంత వెనుకబడిన నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఆచార్యులకు కూడా అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు బ్రహ్మయ్య మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . ప్రజాస్వామ్య పద్ధతిలో వైస్ ఛాన్సర్ నియామకానికి ఉత్తర్వులు జారీ చేయటం అభినందనీయమన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిపోయిన నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు ఒక్కరు కూడా చట్టసభలో ప్రవేశించలేదని , సామాజికంగా తీవ్ర వివక్షతకు గురవుతున్నారు. ఈ స్థితిలో కనీసం రాజ్యాంగ పదవి అయినా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ గా వారికి అవకాశం ఇవ్వాలని కోరారు .

# లండన్‌లో వరల్డ్ ట్రావెల్ మార్కెట్ సక్సెస్

### అలరించిన తెలంగాణ పర్యాటక రోడ్‌షో

### తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** లండన్ వేదికగా మూడు రోజులపాటు జరిగిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకల్లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌తో కలిసి తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొ న్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను షెకావత్ సందర్శించగా మంత్రి జూపల్లి ఆయనకు చార్మినార్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అద్భుతమైన ప్రదేశాలు, చరిత్ర, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసేలా వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో తగిన ప్రచారం చేశామన్నారు.

తెలంగాణలో రామప్ప దేవాల యం, గోల్కొండకోట, చార్మినార్, సోమశిల, బుద్ధ వనం, వేయి స్తంభాల గుడి, చారిత్రక వరంగల్ కోట వంటి ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల ఛాయాచిత్రాలను డబ్ల్యుటిఎం వేదికగా ప్రదర్శించామన్నారు. తెలంగాణలోని ప్రసిద్ధ పురావస్తు కట్టడాల సందర్శనకు ఈ ప్రదర్శన కారణంగా పర్యాటకులు భారీగా పెరుగుతారన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పురావస్తు కట్టడాలను తిలకించేందుకు పర్యాటకులు అత్యంత ఆసక్తి చూపిస్తారనీ, తెలం గాణలోని ప్రసిద్ధ పురావస్తు కట్టడాల సందర్శనకు ఈ ట్రావెల్ ద్వారా పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగి తద్వారా అదే స్థాయిలో ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. కాగా, తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూత ఇవ్వాలని పర్యాటక ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. విదేశీయులు, తెలంగాణ సందర్శించేలా ప్రోత్సహించి పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలసి సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభి వృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, గద్వాల, నాగర్‌కర్నూలు, కల్వకుర్తి, అచ్చం పేట, జడ్చర్ల ఎమ్మెల్యేలు కృష్ణ మోహన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, నారాయణ రెడ్డి, డా.వంశీకృష్ణ, అనిరుద్ధరెడ్డి, పర్యాకట, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ కొట్టాడని యువకుడి ఆత్మహత్య

### పోలీసు ఠాణా ముందు కుటుంబసభ్యుల నిరసన

**అల్లాదుర్గం, నవంబరు 7, ప్రభాతవార్త:** కానిస్టేబుల్ కొట్టాడని మనస్థాపానికి గురైన యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని రాంపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తలారి కిషన్ (36) తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయడానికి బుధవారం రాత్రి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విధి నిర్వాహణలో ఉన్న కానిస్టేబుల్ సాయిలు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరిండమే కాక కొట్టాడన్న మనస్థాపంతో తన గ్రామానికి చేరుకుని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధు వులు పోలీసు ఠాణా ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. యువకుడి చావుకు కారణమైన కానిస్టేబుల్ సాయిలును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను శాంతింపచేసి మెదక్ డిఎస్‌పితో మాట్లాడించారు. న్యాయం చేస్తామని డిఎస్‌పి కుటుంబ సభ్యులకు హామీ చేయడం ధర్నాను విరమించారు.

## సినీహీరో అల్లు అర్జున్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ నవంబరు 7, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్ వైకాపా మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై నంద్యాల రెండో పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే.కృపాసాగర్ బుధవారం కొట్టివేశారు. ఎన్నికల సమయంలో నంద్యాలలోని రవిచంద్ర కిశోర్‌రెడ్డిని ఇంటికి సినీనటుడు అల్లు అర్జున్ రావడంతో అక్కడ అధిక సంఖ్యలో ప్రజలు చేరారని ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించమేనని నంద్యాల గ్రామీణం డిప్యూటీ తహసీల్దార్ ఈ ఏడాది మే 11 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఆధారంగా వారిద్దరు ప్రభుత్వ ఉద్యోగి ఇచ్చిన ఉత్తర్వులపై అవిధేయత చూపారు అంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని వారిరువురూ హైకోర్టులో పిటిషన్ వేయగా దీనిపై ఇటీవలే వాదనలు ముగించిన న్యాయమూర్తి బుధవారం తీర్పు వెల్లడించారు. స్నేహితుడైన కిశోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లారు. అభిమానులను ఆహ్వానించినట్లు ఆధారాలేవు. ఒకటోచ చేరిన అభిమానులను చెదారగొట్టాల్సిన బాధ్యత అధికార యంత్రాగానిదే. ఆ పనిచేయకుండా డిప్యూటీ తహసీల్దారు తప్పుడు మార్గంలో క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. కోడ్ ఉల్లంఘించినట్లు భావిస్తే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి ఉండాల్సింది. అయినా అభిమానులు ఒక చోట చేరడం వల్ల ఎవరికి ఇబ్బంది కలిగినట్లు కనిపించడం లేదు. ఇలాంటి ఘటనలో కేసు నమోదు చేయడం మతిలేని చర్య అవుతుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పిటిషనర్లపై నమోదు చేసిన కేసును కొట్టేస్తున్నాం అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

# పుష్పయాగానికి నేడు అంకురార్పణ

### రేపు వెంకన్నకు విరులసేవ



**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లు తున్న ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్స వర్లకు పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకు శుక్రవారం (నేడు)అంకురార్పణ చేపడతారు. సువాస నలు వెదజల్లే 17రకాల పుష్పాలు, 6రకాలపత్రాలతో ఉత్స వర్లకు పుష్పార్చన వేదమంత్రాలతో పుష్పార్చన చేస్తారు. ఏడుకొండలస్వామికి ఈ ఏడాది జరిగిన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో అర్చకుల వల్లగానీ, పరిచారకులు, భక్తుల వల్ల ఏదేని జరిగిన దోషాల నివారణకు పుష్పయాగం నిర్వహించడం సంప్రదాయం. 9వతేదీ ఉదయం సంపంగిప్రాకారంలోని కల్యాణమండపంలో ఉత్స వమూర్తులకు విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 5గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్స వమూర్తులను పట్టువస్త్రాభరణాలతో అలంకరించి పుష్పయాగం చేస్తారు. కల్యాణోత్స వం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్స వం ఆర్జితసేవలు రద్దయ్యాయి.

# సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారకులే ధర్నాలు చేస్తే ఎలా?

### బిఆర్‌ఎస్ నేతలను నిలదీసిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంట్రాక్టు పనులకు బిల్లులు చెల్లించకుండా సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చిన బిఆర్‌ఎస్ పార్టీ పెద్దలు ఇప్పుడు వారి ముందుండి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎద్దేవా చేసారు. చిన్నచిన్న పనులకు స్థానిక కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని సర్పంచులే స్వయంగా ఆ పనులు చేస్తే అప్పటి ప్రభుత్వ పాలకులు వారిని అప్పుల పాలుచేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేసారని ఆరోపించారు. సర్పంచులకు చెల్లించాల్సి న దాదాపు రూ.1300 కోట్లను దారి మళ్లించి ఇతర అవసరాలకు వాడుకున్న వారే ఇప్పుడు వారి తరపున వకాల్తా పుచ్చుకుని దొంగ సానుభూతి కనబరుస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తెచ్చి పనులు పూర్తి చేస్తే బిఆర్‌ఎస్ ప్రభుత్వం 30 నెలలు పెండింగులో పెట్టిందని ఆయన ధ్వజమెత్తారు. ఆ భారం తమ ప్రభుత్వంపై వేసి ఇప్పుడు దొంగే దొంగ అని అరిచినట్టుగా గోల చేస్తున్నారని విమర్శించారు. పెండింగు బిల్లులతో వడ్డీలు పెరిగి అప్పులు తీర్చే మార్గం లేక 60 మంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడింది నిజం కాదా అని ప్రశ్నించారు. మరో 200 మంది ఆత్మహత్యా యత్నాలు చేస్తే అప్పటి గుడ్డి పాలకుల నుంచి కనీస స్పందన కరవైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఆందోళన చేస్తున్న సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ తరపును మద్దతు తెలిపితే రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొడుతున్నారంటూ మండిపడిన చరిత్ర మీది కాదా అంటూ బిఆర్‌ఎస్ పెద్దలపై ధ్వజమెత్తారు. ఇంత అవకాశవాదం ఎక్కడా ఉండదని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కొంత మంది సర్పంచులు ఇంట్లోని మహిళల బంగారం అమ్మి వడ్డీలు కట్టారన్నారు. సర్పంచ్‌లు అంటే గ్రామ ప్రథమ పౌరుడు. ప్రజలకు సేవ చేసేందుకు ఎన్నికల్లో నిల్చుని గెలిస్తే గులాబీ పార్టీ ఇచ్చిన బహుమతి వారు ఎప్పటికీ మర్చిపోలేనంత దారుణంగా ఉందని ఆరోపించారు. సర్పంచులకు రావాల్సి న బకాయిలను చెల్లిస్తామనే చెబుతున్నామని, దశల వారిగా నిధులను విడుదల చేస్తామని వెల్లడించారు. మాజీ సర్పంచులు ఎవరూ రెచ్చగొట్టే వారి మాటలు నమ్మి ధర్నాలు, ఆందోళనలు చేయవద్దని హితవు చెప్పారు.

# డంపింగ్‌యార్డు నిర్వహణతీరుపై చైర్మన్ బిఆర్‌నాయుడు వాకబు

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలక్షేత్రంలో రోజువారీగా సేకరి స్తున్న పలు రకాల తడి,పొడి చెత్త విభజన,వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలని, దీనివల్ల ఎక్కడా అపరిశుభ్రత నెలకొనకూడదని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కొండపై ప్రోగు చేస్తున్న చెత్తను తీసుకెళ్ళి కాకులకొండ వద్ద డంప్‌చేస్తున్న ప్రాంతాన్ని గురువారం ఉదయం జోరువానలోనూ ఆయన పరిశీలించారు. తనదైన శైలిలో ఛైర్మన్‌గా ఆయన పనితీరును మొదలుపెట్టారు. ఇక్కడ చెత్తసేకరించి చేర్చుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. దీనిద్వారా సేంద్రీయ ఎరువులు తయారీ గురించి సమాచారం సేకరించారు. ఇక్కడ పరిశుభ్రత, కార్మికుల ఆరోగ్యం గురించి వాకబు చేశారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్**
ఆపరేషన్ సర్కిల్, సరూర్‌నగర్
సంక్షిప్త టెండర్ ప్రకటన నం.03/2024-25
ఇబ్రహీంపట్నం డివిజన్-DTR 30 KVA 25 వ్యవసాయ సరఫరా 5 సం.ల యొక్క విస్తరణ కొరకు 14/24-25 మరియు 11 KV బొటెక్ ఫీడర్ యొక్క విభజన కొరకు టెండర్ స్పెసిఫికేషన్ సం.లు 12/24-25-చంపాపేట డివిజన్-LT లైన్స్ యొక్క విస్తరణ మరియు కన్వర్షన్‌కు 13/24-25. 11 KV గ్రీన్‌ఫీల్డ్ ఫీడర్-కన్‌స్ట్రక్షన్ డివిజన్ యొక్క విభజన కొరకు 15/24-25 మరియు సర్కిల్-సరూర్‌నగర్ సర్కిల్‌లో వినియోగం కొరకు వివిధ O&M మెటీరియల్స్ యొక్క సరఫరాకు టెండర్ స్పెసిఫికేషన్ సం.లు 16 నుండి 42/2024-25. తదుపరి వివరాలకు www.tgsouthernpower.org వీక్షించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 7901093649. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/Elect, OP/సరూర్‌నగర్ సర్కిల్, హైదరాబాద్
DIPR.No.6331-PP/CL/Advt/1/2024-25, తేది: 07.11.2024


## తడ వద్ద 20.8 కేజీల గంజాయి స్వాధీనం

### తమిళనాడు, కర్ణాటకకు చెందిన నలుగురు స్మగ్లర్లు అరెస్ట్

**తడ, నవంబర్ 7 ప్రభాతవార్త** ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తిరుపతి జిల్లా తడ వద్ద గురువారం ఉదయం పోలీసులు 20.8 కిలోల గంజాయిని, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు మీడియాకు వివరాలు అందజేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి సూచనలతో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ ఈ దాడుల్లో పాల్గొన్నారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION** VIZAG
"e" Procurement Tender Notice
No. 4/2024-25/CE/SE(P-II&WSM)/EE-(PD-I)/DB/GVMC. 07-11-2024
Number of works 02, Value of works Rs. 5.00 Crores
Tender Opening Dt. 08.11.2024, Closing Date. 22.11.2024
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I), Cell No. 9848308824
For Commissioner



**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక కొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 6-11-2024
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తులు కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) అధ్యక్షులు అయిన శ్రీ బోద్రమోని పురుషోత్తం గారు తమ పార్టీని 'రిజర్వు' గుర్తు లేని రాజకీయ పార్టీగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ బోద్రమోని భానుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గారు (2) శ్రీ ఇంద్రాల శేఖర్ కుమార్, జనరల్ సెక్రటరీ గారు, (3) శ్రీమతి బోద్రమోని సుజాత కోశాధికారి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు, మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 1-8-3/16 సూర్య నగర్, మెట్రో పిల్లర్ నెం.1140, హైదరాబాద్-500004, సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా, ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, డి.టీ.సి.పి. భవనము, ఎసి గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన 15 రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రాని యెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
అధ్యక్షులు
శ్రీ బోద్రమోని పురుషోత్తం, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్)


# బెంగళూరులో 'హైడ్రా' బృందం

### కమిషనర్ రంగానాథ్ నేతృత్వంలో పర్యటన

### చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ పనులు

### ప్రకృతివైపరీత్యాల నిర్వహణపై అధ్యయనం



**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణపై అధ్యయనానికి హైడ్రా బృందం బెంగళూర్ వెళ్లింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం చెరువుల్లోకి వస్తున్న మురుగునీరు ఎస్‌టిపిల ద్వారా పంపుతున్న విధానం, చెరువుల పునరుద్దరణకు అనుసరిస్తున్న విధానాలను బృహత్ బెంగళూరు మహానగర పాలిక సంస్థ (బిబిఎంపి) అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెరువుల పునరుద్దరణపై పనిచేస్తున్న విమోస్ ప్రతినిధులతో సమావేశయమ్యారు. అంతేకాకుండా చెరువుల పురుద్దరణ, సుందరీకరణలో స్థానికులు పోషిస్తున్న పాత్రను అడిగి తెలుసుకున్నారు. 300 ఎకరాల యలహంక చెరువు, 164 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జక్కూరుచెరువును మంచినీటి సరస్సుగా తీర్చిదిద్దుతున్న తీరును పరిశీలించారు. అలాగే సుందరీకరణతోపాటు చెరువులోకి మురుగునీరు, చేరకుండా పైభాగంలో కుంటలు ఏర్పాటు చేసి సిల్ట్‌నుంచి నీటిని వేరు చేసేవిధానాన్ని పరిశీలించారు. ఆతర్వాత బెంగళూర్ లో కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించింది వర్షం సమాచారం ప్రజలకు చేర్చడం. ఎంత మొత్తం వర్షం పడబోతోంది. వరద ముంచెత్తే ప్రాంతలవారిని అలెర్ట్ చేయడం, ట్రాఫిక్ జామ్ అలెర్ట్. ప్రత్యామ్నాయ రహదారులను సూచించే విధానాలపై అధ్యయనం చేశారు. అలాగే బెంగళూర్ మేఘసందేశం (యాప్) పనిచేసే విధానం. వరద కాలువలు ఎంత మొత్తం నీరు వెళ్తోంది. ఎక్కడ చెత్త పేరుకుపోయింది.. వివరాలను అలెర్ట్ చేసే సెన్సార్ విధానాన్ని పరిశీలించారు.

20 యేళ్ల డేటాతో ఎన్ని సెంటి మీటర్ల వర్షం పడితే వరద ముప్పు ప్రాంతాలను అంచనా వేయడం వంటి అంశాలను అడిగి తెలుసుకు న్నారు. కాగా శుక్రవారం కూడా కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో చెరువు లను హైడ్రా బృందం పరిశీలించనున్నారు. ఈబృందంలో అధికారులు పాపయ్య, ఏ. జయప్రకాష్, ఏఈ నాగరాజు, ఇన్స్పెక్టర్ విజయ్ ఆదిత్య తదితరులు ఉన్నారు.

# ఎన్ఎస్‌పి నీటిని విడుదలచేసి ఎపి రైతుల హక్కులు కాపాడండి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ కు నవంబరు 15 నుంచి సాగునీటిని విడుదల చేయాలిఆంధ్ర రైతుల నీటి హక్కులు కాపాడాలని కె.ఆర్.ఎం.బి. ఛైర్మన్ అతుల్ జైన్ విజ్ఞప్తి చేసిన ఎ.పి. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు విజ్ఞప్తి చేశారు.
ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ కు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణా రావు హైదరాబాద్ జలసౌధలోని కె.ఆర్.ఎం.బి. కార్యాలయంలో కె.ఆర్.ఎం.బి. ఛైర్మన్ అతుల్ జైన్ ను కలిసి పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇదే విషయమై జలసౌధ దగ్గర పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు తెలియజేశారు.ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాం 586 అడుగులు 301 టీఎంసీల పూర్తి సామర్థ్యము తో ఉండీ లక్షా 59 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేసే స్థితిలో ఉందని నాగార్జునసాగర్ ఎడమ కాలువ 2, 3 జోన్లకు సంబంధించి 3.62 లక్షల ఎకరాల ఆ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాగార్జునసాగర్ ఎడమకాలువకు 132 టి.ఎం.సి.ల కేటాయింపు ఉందని దానిలో ఆంధ్రప్రదేశ్ కు 32.25 టి.ఎం.సి.ల వాటా వుందని ప్రస్తుతం 3వ జోన్లో 2.11 లక్షల ఆయకట్టులో రైతులు మామిడి, పత్తి, మిర్చి, పొగాకు, జొన్న, మినుము, ఆరుతడి పంటలు సాగుచేసి ఉన్నారని దీనికి నవంబరు 15 నుండి సాగునీటిని నాగార్జునసాగర్ ఎడమకాలువ నుండి విడుదల చేయాల్సిన అవసరం వుందని గత వై.సి.పి. ప్రభుత్వంలో సరాసరి 10 టి.ఎం.సి.లు కూడా ఆంధ్రప్రదేశ్ ఆయకట్టుకు రాలేదని దీనిమీద కె.ఆర్.ఎం.బికి అనేకసార్లు విజ్ఞప్తి చేశామని ఆయన ఆవేదన చెందారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని రైల్, రోడ్డు, విమాన కనెక్టివిటీ ఉన్న కృష్ణా బేసిన్ విజయవాడలోనే ఏర్పాటు చేయాలని కె.ఆర్.ఎం.బి. ఛైర్మన్ అతుల్‌జైన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమకాలువ 2, 3 జోన్లలో రైతులు సాగుచేసిన ఆరుతడి పంటలను కాపాడటానికి నవంబరు 15కల్లా సాగునీటిని విడుదల చేయాలని కె.ఆర్.ఎం.బి. ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. దీనిమీద కె.ఆర్.ఎం.బి. ఛైర్మన్ అతుల్ జైన్ సానుకూలంగా స్పందించారని ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట కమిటీ మాజీ ఛైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు ఉన్నారు.



గురువారం గాంధీభవన్‌లో 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

## విలక్షణ నేత రేవంత్‌రెడ్డి లక్ష్యసాధనగా సాగిపోతాడు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విలక్షణ నాయకుడని లక్ష్యసాధగా ఆయన సాగిపోతాడని ఆయన నాయకత్వంలో తెలంగాణలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళలో పరిఢవిల్లుతోందని టి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో వేణుగోపాల్‌రెడ్డి, విజయార్కె రచించిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితలకు అభినంధలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం తీసుకొని రావడానికి గత పదేళ్లుగా అలుపెరుగకుండా పోరాటం చేశారని అన్నారు. విలక్షణమైన నాయకుడు రేవంత్‌రెడ్డి చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్‌పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'ఒకే ఒక్కడు' పుస్తక ఆవిష్కరణ చేసుకుంటున్నందుకు గర్వంగా ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నదని ఆయన నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎక్కువకాలం రాజకీయాల్లో ఉండాలని మనసు పూర్తిగా కోరుకుంటున్నానని మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు.

# రాష్ట్రంలో 2 లక్షల పోస్టులు భర్తీ చేయనున్న సర్కారు



### మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ. లక్ష ప్రోత్సాహకం
### మనవాళ్లు ఎక్కువమంది ఎంపికైతే రాష్ట్రానికి ప్రయోజనం
### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్ (చిక్కడపల్లి), నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండులక్షల పోస్టులను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్రం కోరి కొట్లాడి తెచ్చుకున్నదే ఉద్యోగాల సాధన కోసం అని, ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం 50వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. గురువారం అశోక్‌నగర్‌లో జరిగిన ఓ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన భట్టివిక్రమార్క పైవిధంగా స్పందించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగాల భర్తీనఇక ప్రతియేటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామన్నారు.
ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందు తెలిపామని, ఆ పనిలో భాగంగా ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలను విజయవంతంగా నిర్వ హించి, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించబోతున్నామన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్నారు.
నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతోపాటు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే మెయిన్స్‌కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించాలని నిర్ణయించిందన్నారు. సివిల్ సర్వీస్‌కు మన రాష్ట్రం నుంచి పెద్దఎత్తున ఎంపికైతే మన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని, సివిల్ సర్వీస్ అయినప్పటికీ పాలనలో మనవాళ్లు ఎంత ఎక్కువమంది ఉంటే ప్రాంతీయ అభిమానంతో సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, ఇతర అంశాల ద్వారా రాష్ట్రానికి ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందన్నారు. యూపీ కేడర్‌లో పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగువారైన మోహన్‌రావు, అరుణ ఆధ్వర్యంలో నగరంలో యుసిఎస్‌సి కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో కోచింగ్ అకాడమీలు రావాల్సిన అవసరం ఉందన్నారు.

## కృష్ణాడెల్టా ఆధునీకరణ వల్ల 132.9 టిఎంసిలకు తగ్గిన నీటివాడకం

### పట్టిసీమతో మరింత తగ్గుదల
### కెఆర్ఎంబి ముందు రెండోరోజు
### సిడబ్ల్యుసి మెంబర్ ఎకె గోయల్ వాంగ్మూలం

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** కృష్ణా డెల్టాను 1995 ఆధునీకరణ వల్ల 152.2టిఎంసిల నీటి వినియోగం నుంచి 132.9కి తగ్గిందని సిడబ్ల్యుసి మెంబరు ఎకెగోయల్ వాగ్మూలం ఇచ్చారు. గురువారం రెండో రోజు కూడా తెలంగాణ రాష్ట్రానికి చెందిన అడ్వకేట్లు ఎకెగోయల్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేశారు. కెడిఎస్ ప్రాజెక్ట్ రిపోట్ అనేది సరైనదేనా దానికి అవసరం 152.20 టిఎంసిలు మీరు ఆమోదించినట్లు పేర్కొన్నారు నిజమేనా అని తెలంగాణ న్యాయవాదులు ప్రశ్నించారు. (ఎగ్జిబిట్ ఎపి డిపి -1యొక్క పేజీ 26 వద్ద పేరా. 2,4.6) ఆధునికీకరణ డిసెంబర్, 1995లో కెడిఎస్ పరిధిలో ఆధునీకరణ వల్ల నీటి పొదుపు సాధ్యమే అని సూచించారని డిపెండబుల్ వాటర్ యొక్క వినియోగం 132.9 తగ్గుతందని పేర్కొన్నవిధంగా తగ్గించడం జరిగిందా అని ప్రశ్నించారు. దానికి ఆయన జవాబు అవును చెప్పారు. కెడిఎస్ ఆధునికీకరణ నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కు పేర్కొనబడింది సిడబ్లుసికి సమర్పించబడింది. అయితే, సిడబ్ల్యుసి తుది ఆమోదం మొత్తంగా కోసం కృష్ణాడెల్టాలో ప్రస్తుతం 155.40 టీఎంసీల అవసరమవతున్నాయని . అందులో 3.2 టీఎంసీలు భూగర్భంలో ఇంకిపోతున్నాయని పేర్కొన్నారని తెలిపారని ఎకెగోయల్ తెలిపారు.. 1995 డిసెంబరు నుండి లైనింగ్ వల్ల నీటిపారకం మెరుగుపడింది మరియు అభివృద్ధి కారణంగా వ్యవసాయ మరియు పంట పద్ధతులు, నీటిపారుదల అవసరం కేడీఎస్ 130 టీఎంసీలకు మించి ఉండదు అని పేర్కొన్నారు. మీరు ఏమి చెప్పాలి? 1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమా ప్రాజెక్టు వల్ల అదనంగా గోదావరి నీరు కూడా వస్తున్నదని పట్టిసీమ మళ్ళింపు ద్వారా వచ్చే అదనపు నీరు కింద కూడా కృష్ణాడెల్లాలో సాగు నీటి స్థిరీకరణ జరిగిందాలేదా అని అడిగారు. హైడ్రాలజీగా నిపుణులు మాత్రం డెల్టాలో తక్కువ ఆయకట్టుకు కృష్ణానీరు వాడి మిగితాది అత్యధిక పరిమాణంలో నీరు సముద్రంలోకి వెళుతుంది అని అంటున్నారని ఎకె గోయల్ తెలిపారు.

## ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ బిజెపిని మరింత బలోపేతం చేయాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (కంటోన్మెంట్), నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వారికి అప్పులు కూడా పుట్టడం లేదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం కంటోన్మెంట్‌లోని రాజరాజేశ్వరీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బిజెపి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిఆర్ఎస్ దోపిడీ విధానాన్ని ప్రజలు అరికట్టి కాంగ్రెస్‌కు పట్టం కట్టబెడితే అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఏ ఒక్క గ్యారెంటీని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే ప్రశక్తిలేదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చినప్పటికి ప్రజా సమస్యలు పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వాధానాలకు వ్యతిరేకండా పోరాటాలు, ఉద్యమాలకు బిజెపి శ్రేణులంతా కలిసి కట్టుగా ఉద్యమించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు వరకు బిజెపిని బలోపేతం చేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు ఉన్న ఏకైక బిజెపి పార్టీ అన్నారు. కార్యక్రమంలో ఎంపిలు ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్, డి.కె. అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, ఎండల లక్ష్మి నారాయణ, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాం చందర్‌రావు, బిజెపి నాయకులు జె.రామకృష్ణ, భానుకల్లికార్జున్, బి.ఎన్. శ్రీనివాస్, మేకల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ రాజరాజేశ్వరీ గార్డెన్‌లో బిజెపి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

## జలమండలి 90 రోజులు స్పెషల్‌డ్రైవ్‌లో ప్రత్యేక చర్యలు

### 50 వేల మ్యాన్‌హోళ్లు శుభ్రం
### 700 కిలో మీటర్ల పైపులైన్‌కు డీసిల్టింగ్ పనులు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ లక్ష్యంగాంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 50 వేల మ్యాన్ హోల్స్ శుభ్రం చేశారు. దీంతో పాటు 6140 ప్రాంతాల్లో 700 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్ ను డీసిల్టింగ్ పనులు నిర్వహించారు. ఈ ఘనత సాధించినందుకు అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. అందరూ నిబద్ధతతో పని చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా గత 15 రోజులుగా పనితీరు బాగుందని కొనియాడారు. ఇదే స్ఫూర్తి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా జలమండలి 90 రోజుల స్పెషల్ డ్రైవ్ ను చేపట్టింది. ఈ స్పెషల్ డ్రైవ్ లో హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడంతో పాటు, భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటారు.

## 48 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి

### గత యేడాది కంటే తగ్గిన దిగుబడి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** తెలంగాణలో వానాకాలానికి సంబంధించి పత్తి ఉత్పత్తుల అంచనాలను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. ఊహించని విధంగా ఈ ఏడాది పత్తి దిగుబడి తగ్గిపోయింది. ఈ మేరకు ప్రస్తుత 2024-25కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 48 లక్షల బేళ్ల పత్తి దిగుబడి అవుతుందని లెక్కకట్టింది. ఇది గత సంవత్సరంతో పోల్చితే తగ్గుదల నమోదైంది. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 3లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి తగ్గుతోంది. గత ఏడాది రాష్ట్రంలో 51 లక్షల బేళ్లకు పైగా పత్తి ఉత్పత్తి జరిగింది. ఈ లెక్కన ఈ ఏడాది 2 శాతం ఉత్పత్తి తగ్గుతోంది. కాగా వ్యవసాయ శాఖ నిర్దేశించిన లక్ష్యం కాదు కదా, కనీసం సాధారణ విస్తీర్ణం కంటే కూడా భారీగా తగ్గిపోయింది. ఖరీఫ్ సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ విస్తీర్ణం కంటే మించి 60 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో పత్తి సాధారణ విస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా, దీని కంటే మించి 60 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేయాలని నిర్దేశించింది. అయితే ఈ ఖరీఫ్ సీజనులో కేవలం 43.76 లక్షల ఎకరాలకు మాత్రమే పత్తి సాగు పరిమితమైంది. ఇది సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 86.67 శాతం మేర మాత్రమే సాగు చేయడం జరిగింది.

## పరమపావన క్షేత్రంగా యాదాద్రిని తీర్చిదిద్దుతాం

### 15 నుంచి విమాన గోపురానికి బంగారు తాపడం పనులు
### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని పరమ పావన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నా రు. దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణగోపురం స్వామివారిదే కావడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 15 నుంచి విమాన గోపురానికి బంగారు తాపడం అమర్చే పనులు ప్రారంభమవుతాయనీ, 2025 మార్చి 1 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఉన్నందున ఈలోపే పనులు పూర్తి చేయాలని ఈవోను ఆదేశించారు. ఈ పనులు పూర్తయిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహా కుంభాభిషేకం అనంతరం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వైటిడిఏ ఆధ్వర్యంలో దేవాలయం పరిసర ప్రాంతాల అభివృద్ధికి మొత్తం 1241.36 ఎకరాల భూమి సేకరించినట్లు వైటిడిఏ వైస్ ఛైర్మన్ కిషన్ రావు తెలిపారు.
భవిష్యత్ అవసరాల నిమిత్తం సేకరించాలనుకున్న 101.10 ఎకరాల భూమికి సంబంధించిన ఫైలు ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వద్ద ఉందని తెలుపగా మరోసారి సమీక్షించిన తరువాత భూమిని సేకరించేది లేదని తెలియజేస్తామని మంత్రి స్పష్టం చేశారు.
అలాగే, 10 వేల చదరపు అడుగుల బంగారు తాపడం సంబంధిత పనులకు గాను ఇప్పటి వరకు 1600 చదరపు అడుగుల పనులు పూర్తయ్యాయనీ ఈవో తెలిపారు. బంగారు తాపడం నిమిత్తం 60 కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ చార్జీలకు కలిపి మొత్తం రూ.8 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో మార్గదర్శకాలను పాటించాలని మంత్రి ఇఒకు సూచించారు. వైటిడిఏకు కేటాయించిన మొత్తం బడ్జెట్ అందుబాటులో ఉన్న నిధులు ఇప్పటికి నిర్ధారించి పెండింగ్‌లో ఉన్న పనులకు కావాల్సిన నిధులు తదితర వివరాలను వైటిడిఏ విసి కిషన్ రావు మంత్రికి వివరించారు.

## దేవాదాయ శాఖలో పదోన్నతుల వివాదం

### మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు
### పూర్తి వివరాలు అందజేయాలని అధికారులకు ఆదేశం
### బాధ్యులు ఎవరనే అంశంపై జోరుగా చర్చ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** దేవాదాయ శాఖలో ఇటీవల జరిగిన పదోన్నతుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కొందరు అధికారులు ఫిర్యాదు చేయడంతో బాధ్యులు ఎవరనే అంశంపై ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందాలంటే 4 కేటగిరీల్లో పొందాల్సి ఉంటుందనీ, గ్రేడ్ 1 ఈవో పోస్టులు క్యాడర్ స్ట్రెంత్ పెరిగి మఫిసిల్ క్యాడర్ స్ట్రెంత్ పోస్టులు పెరగకపోవడంతో పదోన్నతులలోఆ కేటగిరి వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లలో 20 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా పనిచేస్తున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని మంత్రిని కోరారు. ఇటీవల దేవాదాయ శాఖలో పదోన్నతులలో భాగంగా ఆలయ సూపరింటెండెంట్లుగా ఉన్న వారిలో కొందరికి గ్రేడ్ 1 ఈవోలుగా, 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అన్ని అర్హతలుండి పదోన్నతి పొందని వారు, తమకు దక్కాల్సిన పోస్టింగ్‌ను డబ్బులు పోసి అవతలి వారు దక్కించుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 261 ప్రకారం జూనియర్ అసిస్టెంట్లను గ్రేడ్ 3 ఈవోలుగా, సీనియర్ అసిస్టెంట్లను గ్రేడ్ 2 ఈవోలుగా, సూపరింటెండెంట్లను గ్రేడ్ 1 ఈవోలుగా ట్రాన్స్‌పర్ ఆఫ్ సర్వీస్ కింద నియమించాల్సి ఉంటుంది. కానీ, ఇటీవలి పదోన్నతుల్లో ఆ నిబంధనను పక్కనబెట్టి నేరుగా పదోన్నతి ఇచ్చారు. ఈ వ్యవహారం మొత్తం ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లో జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి ఆదేశాల మేరకు కింద పనిచేసే ఇద్దరు ముగ్గురు సిబ్బంది మొత్తం చక్రం తిప్పుతున్నారనే చర్చ జరుగుతోంది. ఆ ఉన్నతాధికారి చెప్పిన వారికే మంచి పోస్టింగులనీ, కొందరి కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించి మరీ పనులు చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
దేవాదాయ శాఖలో ఈవోల కొరత ఉన్నప్పటికీ ప్రధాన కార్యాలయంలోనే కొనసాగిస్తున్నారు. దేవాదాయ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఆ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి దేవాదాయ శాఖలో ఇటీవల పదోన్నతుల వ్యవహారంపై పూర్తి వివరాల అందజేయాలని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గత వారం జరిగిన ఐఎఎస్‌ల బదిలీలలో భాగంగా ప్రభుత్వం దేవాదాయ శాఖ కమిషనర్‌గా హనుమంతుకు బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కొత్త కమిషనర్ త్వరలో సమీక్ష నిర్వహించి అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో ఆరా తీయనున్నట్లు సమాచారం.

## సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలికాన్ఫరెన్స్‌లో సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ శుక్రవారంతో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే మొదటిసారిగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియని ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్య పర్చేలా విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటినికూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.



# భూటాన్‌తో ద్వైపాక్షిక సంబంధాల్లో మరో ముందడుగు

### భూటాన్ ప్రధాని, అసోం గవర్నర్‌తో కలిసి ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** భారత్-భూటాన్ దేశాల మధ్య మధ్య నేడు చారిత్రక పరిణామం చోటు చేసుకుంది. అసోంలోని దరంగా వద్దనున్న భూటాన్ సరిహద్దుల్లో ఇమిగ్రేషన్ చెక్ పోస్ట్ ప్రారంభమైంది. భూటాన్ ప్రధానమంత్రి శెరింగె తోబ్గే, అసోం గవర్నర్ ఆచార్య లక్ష్మణ్ ప్రసాద్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా చేతుల మీదుగా ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్ ప్రారంబించారు. ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటుతో ఇరు దేశాల ప్రజల మధ్య రవాణా సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి. చెక్‌పోస్టు ఏర్పాటుతో భారత్‌కు రవాణా ఖర్చుల భారం చాలా మేరకు తగ్గనుంది. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు మరింతగా పెరగనున్నాయి. వ్యాపార, వాణిజ్య, సేవా కార్యకలాపాలను సులభతరం కానుంది. ఈ చారిత్రాక పరిణామం నేపథ్యంలో అసోంలోని దరంగా వద్ద ఏర్పాటు చేసిన ఇమిగ్రేషన్ చెక్ పోస్టు ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. ఇమిగ్రేషన్ చెక్ పోస్టు ప్రారంభంతో భారత్, భూటాన్ దేశాల బహుళ సంబంధాన్ని మరింత సన్నిహితం చేయడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలలో ప్రామాణికత ఏర్పడిందన్నారు. భారత-భూటాన్ సంబంధాలు పరస్పర గౌరవం, సాంస్కృతిక సౌభ్రాతృత్వం, గొప్ప విశ్వాసంపై నిర్మించబడ్డాయన్నారు. ఇరుదేశాల మధ్య స్నేహం, సహకారం, సామాజికత బలోపేతం చేయాలన్న భారత్ దృష్టికోణానికి ప్రతీకగా నిలుస్తుం దన్నారు. హోంశాఖ పరిధిలోని ల్యాండ్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సరిహద్దుల వద్ద అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక వసతులు కూడా అందిస్తుందన్నారు. అదేవిధంగా ప్రయాణికులకు, వ్యాపారులకు సౌకర్యవంతమైన, భద్రత, సమర్థవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తోందన్నారు. దరంగా ఇమిగ్రేషన్ చెక్ పోస్ట్ ద్వారా పొరుగు దేశాలతో ఆర్థిక సహకార, సామాజిక సంబంధాల్లో నూతన అవకాశాలను సృష్టించేందుకు అవసరమైన డిజిటల్ మార్గాలను అన్వేషిస్తోందన్నారు. సరిహద్దుల భాగస్వామ్యానికి సాక్ష్యమన్నారు. ఇరు దేశాల భాగ స్వామ్యం సహకార భద్రతా పునాదులు. నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, సమాచార, ఆరోగ్యం, సాంస్కృతిక మార్పిడి, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధన, విద్య వంటి కీలక రంగాలకు విస్తరించిందన్నారు.
ఇమిగ్రేషన్ చెక్ పోస్టు ఏర్పాటు వల్ల రవాణా, వాణిజ్య తోడ్పాటు అందించడం మాత్రమే కాకుండా పొరుగున ఉన్న దేశాలతో సంబంధాలను మరింత వ్యాపారంలో విప్లవాత్మక మార్పులకు, భద్రతను పెంచడానికి అత్యాధునిక వనరులను ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సమకూర్చిందన్నారు. అదేవిధంగా ల్యాండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ పార్కింగ్ రిజర్వేషన్, ఆటోమేటెడ్ స్టోరేజ్, సులభతర నియంత్రణ అనుమతులు వంటి సౌకర్యాలతో ల్యాండ్ పోర్ట్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేస్తుందన్నారు. ఇది కేవలం ఆపరేషనల్ సమర్థతను పెంచేదే కాకుండా, సరకు మరియు ప్రయాణికుల భద్రతను కూడా మెరుగుపరుస్తోందన్నారు. ల్యాండ్ పోర్ట్ విస్తరణ కేవలం రోడ్డు మార్గం వరకు పరిమితం కాదన్నారు. మల్టీ మోడల్ కనెక్టివిటీకి మార్గం సుగమమైందన్నారు. రైల్వే, అంతర్రాష్ట్ర జలమార్గాలను రోడ్డుకు కనెక్ట్ చేసి పొరుగుదేశాలతో మరింత వాణిజ్య సామర్థ్యాన్ని పెంపొందించడమే ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యమన్నారు. భవిష్యత్తులో భూమి, రైల్వే, జలమార్గాలను కలిపి సరిహద్దుల మధ్య సరకు, సేవలు నిరంతరం కొనసాగేలా మద్దతు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. 2030 నాటికి లాజిస్టిక్స్ పర్ఫార్మెన్స్ ఇండెక్స్‌లో ప్రస్తుత టాప్ 25 దేశాల జాబితాలో చేరాలన్న ప్రభుత్వ విజన్‌కు కూడా ఇది బలాన్ని ఇస్తుందన్నారు.



# రాష్ట్రంలో ఎన్టీపిసి ఫేజ్ 2కు గ్రీన్‌సిగ్నల్

## 29న ప్రజాభిప్రాయ సేకరణ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఎన్టీపీసీలో ఫేజ్ 2 ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఢిల్లీలోని ఎన్టీపీసీ కంపెనీ పధాన కార్యాలయంలో జరిగిన బోర్డు సమావేశంలో ఫేజ్ 2 విస్తరణకు అనుమతినిస్తూ తీర్మానించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నెలకొల్పే క్రమంలో ఇప్పటికే ఫేజ్ 1 కింద 899 మెగావాట్లకు సంబంధించిన రెండు యూనిట్లతో మొత్తం 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నిర్మించారు. తాజాగా మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు ప్లాంట్లు నిర్మించడం ద్వారా 2400 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఫేజు 2 సామర్థ్యం కలిగిన మూడు యూనిట్ల నిర్మాణానికి మొత్తం 29,344.85 కోట్ల రూపాయల మేర వ్యయం అవుతుందని అంచనా. కాగా ఎన్టీపీసీ ప్లాంట్ ఫేజ్ 2 నిర్మాణం కోసం 1,190 ఎకరాల భూమి అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే మట్టి నమూనాలను పరీక్షించడం జరిగింది. చిమ్మితో పాటు, ఇతర నిర్మాణలాలకు అనుకూలమైన స్థలాలను బోర్‌వెల్ తద్వకాల ద్వారా గుర్తించారు. కాగా ఎన్టీపీసీ ఫేజ్ 2 విద్యుత్ ప్లాంట్ నిర్మాణం నిమిత్తం ఈ నెల 29న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని నిర్ణయించింది.

# ఏజెన్సీలో అంగన్‌వాడీ కేంద్రాలు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నూతన అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాట్లు చేసేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శాఖ ప్రతిపాదనలు చేసింది. కేంద్రానికి కేంద్రం అమలు చేస్తున్న జనజాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్ పథకం కింద రాష్ట్రంలోని 81 గిరిజన ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి గాను ప్రతిపాదించింది. పాత నిబంధనల ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుంది. కాగా కేంద్రం ఈ పథకంలో మార్పులు చేసి ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్‌గా మార్చింది. ఇందుకు అనుగుణంగా నిబంధనల్లోనూ కూడా మార్పు చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం మొత్తం నిధులను కేంద్రమే భరించనుంది. గిరిజన ప్రాంతలో కొత్త అంగన్వాడీ కేంద్రాలకు 12 లక్షల రూపాయల చొప్పున నధులు ఇవ్వనుంది. ఇదే సమయంలో ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు లక్ష రూపాయల చొప్పున అందించనుంది.



గురువారం విశాఖలో బ్యాడ్మింటన్ అకాడెమీ శంకుస్థాపన కార్యక్రమంలో పివి సింధు

# విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి పివి సింధు శంకుస్థాపన

## భారతీయ బ్యాడ్మింటన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యం

### ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు

**ఆరిలోవ, నవంబరు 7, ప్రభాతవార్త:** ప్రముఖ బా య్డ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు తన బ్యాడి మ్రంటన్ అకాడమీ నిర్మాణానికి గురువారం విశాఖలోని పెదగదిలి కూడలి వద్ద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన మూడు ఎకరాలు స్థలంలో సింధుతో పాటు ఆమె తల్లిదండ్రులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధు మీడియాతో మాట్లా డుతూ అకాడమీ నిర్మాణం జరిగితే రానున్న రోజుల్లో ఈ ప్రాంతానికి కొత్త కళ వస్తుందని, అనేక మంది ఔత్సాహిక క్రీడాకారులకు ఇది వరంగా మారుతుందని, అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడించ నున్నట్లు ఆమె తెలిపారు.

భారతీయ బ్యాడ్మిం టన్ ... ఫలితాల పరంగా సవాళ్లను ఎదుర్కొం టున్నందున, తదుపరి తరానికి దారి చూపడం, మార్గనిర్దేశం చేయడం నా బాధ్యతగా భావించి, భారతీయ బ్యాడ్మింటన్‌ను మరింత అభివృద్ధి చేయడమే కాకుండా మొత్తంగా మన దేశంలో క్రీడల అభివృద్ధికి దోహదపడేలా ఒక వైవిధ్యాన్ని సృష్టించడమే తన ప్రధాన లక్ష్యంగా పెట్టుకు న్నట్లు ఆమె తెలిపారు. ఏడాదిలోగా బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రయత్ని స్తామని సింధు తెలిపారు

# శ్రీచైతన్య బ్లడ్ డొనేషన్ క్యాంప్

## చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీభాయి జన్మదినం..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భాంగా శ్రీచైతన్య విద్యాసంస్థలు, మెడికవర్ హాస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు రాష్ట్రాలోల (ఆంధ్ర,తెలాంగాణ,కర్ణాటక, తమిళనాడు) శ్రీచైతన్య కాలేజీలు,స్కూళ్లలో 3,700కి పైగా మంది శ్రీచైతన్య సిబ్బంది పాల్గొన్న 3,700 యూనిట్లకు పైగా బ్లడ్ డొనేట్ చేసి సేవాస్ఫూరితగా నింపారు. ఈ రక్తదాన కార్యక్రమంలో భాగాంగా మియాపూర్ లో శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ట్ స్కూల్‌లో 300 మాందికి పైగా స్పబ్బంది రక్తదానం చేశారు. భారత దేశ విద్యారంగ చరిత్రలోనే రికార్డు స్థాయి విజయాలను సొంతం చేసుకున్న శ్రీచైతన్య విద్యా సంస్థలు విద్యా రంగంలోనే కాకుండా సమాజ శ్రేయస్సులో మేము సైతం అంటూ ముందాంటామని గతాంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేసిన సహాయకార్యక్రమాల ద్వారా నిరూపాంచారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ ... 40 ఏళ్ల క్రితం డాక్టర్ బియస్ రావు నాటిన్ ఓ చిన్ విద్యా విత్తనం నేడు మహావృక్షమై ఎందరో ప్రపంచం గర్వించే మేధావులను అందించే స్థాయికి చేడం వెనుక డాక్టర్ బియస్ రావు అకుంఠితదీక్ష, శ్రీచైతన్య విద్యా సంస్థల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది కృషి వెలకట్టలేనిది. బియస్ రావు భౌతికంగా మన మధ్యలేక పోయినా ఆయన ఆశయాలు ఎల్లపుడూ మన మధ్యనే ఉంటాయి. ఆ విజయపరంపరను అలాగే కొనసాగించే బాధ్యతను నిర్వహిస్తున్న మా కూతుళ్ల శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరక్టర్ సుష్మ, శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ, అభినందనీయులు. ఈ రోజు నా జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్ శ్రీచైతన్య ఫ్యామిలీ మెంబర్స్ అందరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరక్టర్ సుష్మ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థలు ఈస్థాయిలో ఉండటం వెనుక మా అమ్మ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి త్యాగం.కృషి వెలకట్టలేనివి. ఈ జన్మదినం శుభసమయాన శ్రీచైతన్య విద్యార్థులు సాధించిన సూపర్ హాట్రిక్ వరల్డ్ రికార్డ్ చిరస్థాయిగా నిలిచిపోతుంది. విద్యలోనే కాకుండా సామాజిక బాధ్యతగా శ్రీచైతన్య విద్యా సంస్థలు నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమంలో మా శ్రీచైతన్య సిబ్బంది పాల్గొని ఆదర్శంగా నిలిచారు. శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరక్టర్ సీమ బొప్పన మాట్లాడుతూ... శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యలోనే కాకుండా సామాజిక సేవాకార్యక్రమంలో సైతం ముందుంటుందని అందరికీ తెలిసిదే. ఈ రోజు మా అమ్మ శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమంలో స్వచ్ఛందంగా వందలాది శ్రీచైతన్య సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

# సిసిఐ కేంద్రాల్లోనే పత్తి అమ్మండి

## ప్రత్యేక పోర్టల్‌లో సమగ్ర వివరాలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** రైతులు తమ పత్తిని సిసిఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం రాష్ట్రంలో పత్తి అమ్మకాలు, కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కోనుగోళ్ల కేంద్రాల్లో పత్తిని అమ్మినట్లయితే మద్దతు ధరలు వచ్చి రైతులు ప్రయోజనాన్ని పొందుతారని చెప్పారు. అయితే ఇదే సమయంలో నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఫెయిర్ ఆవరేజ్ క్వాలిటీ (ఎఫ్ఎక్యూ) ప్రమాణాలు పాటించినట్లయితే మంచి ధరలు లభిస్తాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువస్తున్న పత్తికి సంబంధించి రోజు వారీ లావాదేవీలు, అమ్మకాలను గూర్చి ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు జిన్నింగ్ మిల్లులను అకస్మిక తనిఖీ చేయాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో నియమించిన ప్రత్యేక అధికారులే పత్తి కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని చెప్పారు. పత్తి కొనుగోళ్లపై సమగ్ర వివరాలు అందించేలా ఒక వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోళ్లు, తిరస్కరించిన వివరాలు సైతం ఇందులో పొందుపరుస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయలను కల్పిస్తూ రాష్ట్రంలోని మేజర్ వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునీకరించాలని స్పష్టం చేశారు.



## అనర్హత అంశంపై అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన

# పిటిషన్‌పై సిజె ధర్మాసనం సీరియస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. అనర్హత అంశంపై అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన పిటిషన్‌పై తొలుత కడియం శ్రీహరి తరఫున న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. అయితే, అసలు ఈ అప్పీల్‌లు దాఖలు చేసే అర్హత అసెంబ్లి కార్యదర్శికి లేదని సీజే ధర్మాసనం సీరియస్ అయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లను స్పీకర్ ముందు ఉంచాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. ఆ తర్వాత స్పీకర్ సూచన మేరకు షెడ్యూల్‌ను రిజిస్ట్రీ ముందు ఉంచమని చెప్పారు. స్పీకర్ ముందు ఉంచను అని చెప్పే అధికారం కార్యదర్శికి లేదని.. అతను ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నారు.. కాబట్టి కోర్టు ఉత్తర్వులు పాటించాల్సిందేనని తేల్చి చెప్పారు. అధికారాలను ఎంజాయ్ చేస్తా.. విధులను మాత్రం నిర్వహించను అంటే సరికాదని పేర్కొంది. అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్‌లు మెయింటనబుల్ కాదని, కొట్టివేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర కోర్టుకు తెలిపారు. పార్టీ ఫిరాయించిన ఓ ఎమ్మెల్యే ఏకంగా ఎంపీగా పోటీ చేశారని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఇటీవల సింగిల్ జడ్జి తీర్పును సీజే ధర్మాసనంలో అసెంబ్లీ కార్యదర్శి సవాల్ చేశారు. స్పీకర్ నిర్ణయాల్లో హైకోర్టు జోక్యం చేసుకోకూడదని పిటీషన్‌లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటీషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి తీర్పు వెలువరించారు.

# బెంగళూరు వీధుల్లో బ్రిటన్ మాజీప్రధాని దంపతులు

**లండన్, నవంబరు 11:** బ్రిటన్ మాజీ ప్రధాని భారత సంతతికి చెందిన రిషిసునక్ బెంగళూరులో మెరిసారు. తనభార్య అక్షతామూర్తితోకలిసి ఒక కాఫీషాప్‌లో సందడిచేసారు. స్థానికులతో ఫోటోలు సెల్ఫీలు దిగుతూ ఆకట్టుకున్నారు. రిషిసునక్ ఆయన భార్య అక్షతామూర్తి ఇటీవలే బెంగ ళూరులోని థర్డ్‌వేవ్ కాఫీ షాప్‌లో కాఫీడేట్‌ను ఆస్వాదించారు. ఇద్దరూ టేబుల్ వద్ద కాఫీని ఎంజాయ్‌చేస్తూ సరదాగా కబుర్లుచెప్పుకుంటూ కనిపించారు. ఆ సమయంలో కాఫీ షాప్‌కువెళ్లిన స్థానికులు రిషిసునక్ జంటను చూసి థ్రిల్ అయ్యారు. వారితో ఫోటోలు సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. వారి ఫోటోలు విడియోలు ఇపుడు నెట్టింట వైరల్ అయ్యాయి. రిషి సునక్ 2022నుంచి 2024 వరకూ బ్రిటన్ ప్రధాన మంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో రిషి సునక్ పార్టీ ఓటమి చవిచూసింది. ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సుధా మూర్తి కుటుంబం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో విజయవంతంగా ఓ సాఫ్ట్‌వేర్‌సంస్థను నడుపు తున్నప్పటికీ సాదాసీదా జీవితం గడుపుతుంటారు. వీరి కుమార్తె అక్షతా మూర్తి. అక్షత రిషి సునాక్‌ప్రేమవివాహం చేసు కున్నారు. రిషి యుకెప్రధానిగా ఉన్న సమయంలో అక్షతామూర్తి బెంగళూరు వీధుల్లో తన తండ్రితోకలిసి షాపింగ్‌చేసిన సంగతి తెలిసిందే. తండ్రి నారాయణమూర్తి, తల్లి సుధామూర్తి ఇద్దరు కుమార్తెలు అనౌష్క, కృష్ణతో కలిసి నగరంలోని రాఘవేంద్ర మఠాన్ని సందర్శించారు. అయితే ఆ టైమ్‌లో ఎలాంటిభద్రత లేకుండా సాధారణ పౌరుల్లా అక్కడ మొత్తం కలియతిరగడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాదు పలు సందర్భాల్లో వీరు సిలికాన్ సిటీలోకూడా సందడిచేసారు.



# నేడు ఉద్దాల మహోత్సవం

## తరలిరానున్న లక్షలాది భక్తులు

### కనులపండువగా కురుమూర్తి ఉత్సవాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 7 ప్రభాతవార్త :** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం శుక్రవారం జరగనుంది. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి గ్రామంలో తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరుని ప్రతిరూపమై పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి ఉద్దాల వేడుకకు అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. సుమారు నెలరోజులపాటు సాగే ఉత్సవాల్లో ఉద్దాలోత్సవం అనేది ప్రధాన ఘట్టం. చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డెమాన్ గ్రామం నుంచి ఈ వేడుక ప్రారంభంకానున్నది.

**ఉద్దాల తయారీ ప్రత్యేకం..**

సంస్థానాధీశుల కాలం నాటి సాంప్రదాయం ప్రకారం గ్రామంలోని ఉద్దాల కర్మాగారంలో అమావాస్య రోజు రాత్రి గంగాపూజ అనంతరం స్వామివారి పాదరక్షల తయారీ దళితులు మొదలుపెడతారు. ఉద్దాల మండపంలో పరిచిన ఊకచెట్టు వాగు ఇసుకపై అర్ధరాత్రి దాటిన అనంతరం కురుమూర్తిస్వామి, పద్మావతి దేవి అమ్మవార్ల పాదాల గుర్తుల కనుగుణంగా పాదుకల తయారీ ప్రారంభమవుతుందని పల్లె ప్రజల్లో చారిత్రక కథనం ఉంది. పద్మావతి సమేతంగా కుబేరుని అప్పు తీర్చలేక తిరుమల వీడి కృష్ణానది తీరం చేరిన శ్రీ వెంకటేశ్వరుడు కృష్ణా నదిలో సేదతీరిన అనంతరం స్వామివారి పాదాలు కందిపోకుండా కృష్ణావేణి పాదుకలు బహూకరించిందని ఆ పాదుకలనే ఉద్దాల ఉత్సవంలో ఊరేగిస్తారని మరొక కథనం, చిన్న వడ్డెమాన్ గ్రామంలో రాయలసీమ ప్రాంతం నుంచి సమకూర్చుకున్న ఆవు చర్మంతో చర్మకారులు వారం రోజులపాటు శ్రమించి స్వామివారి పాదుకలను తయారు చేస్తారు. పాదరక్షల తయారీ సందర్భంగా దళితులు ఏడు రోజుల పాటు నియమ నిష్టలతో స్వామివారి ఉద్దాల కర్మాగారంలోని నివాసముంటారు. ఉద్దాల తయారీలో చిన్న వడ్డెమాన్ గ్రామంలో 60 దళిత కుటుంబాలకు చెందినవారు పాల్గొంటారు. కార్తీకమాసం నుంచి ఏడు రోజులపాటు నియమ నిష్టలతో ఒంటిపూట భోజనం చేస్తూ పాదుకలను తయారు చేస్తారు. పాదుకలకు ఆవుచర్మం, వన్నెలాకు తగురం, పచ్చపూసలు, టెన్‌పోగులు, తగ్గి, వైనం, రేషం, పట్టు తదితర వాటితో తయారు చేస్తారు. సప్తమినాడు ఈ పాదుకలను ఊరేగింపుగా కురుమూర్తి గిరులకు చేరుస్తారు. అప్పంపల్లి గ్రామంలో కుమ్మరులు నియమ నిష్టలతో తలియకుండను తయారు చేసి ఊరేగింపుగా వడ్డెమాన్‌లోని ఉద్దాల కర్మాగారానికి చేర్చుతారు. శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో కులవృత్తులకు అవకాశం దక్కింది. స్వామివారి పాదుకలను ఉంచేందుకు చాటను పల్లమరి గ్రామంలోని మేదరులు నియమ నిష్టలతో తయారు చేస్తారు. ఉద్దాల ఉత్సవం రోజున మొదటగా పల్లమరిలోని చాటను ఊరేగింపుగా ఉద్దాల కర్మాగారానికి చేర్చుతారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేగకన్నుతో భద్రతను చేపడతామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్దాల మహోత్సవానికి 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరలో 100 సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



స్వామివారి ఉద్దాల మండపం

# మిల్లర్లు బకాయిలు చెల్లించరు..

## కేంద్రం గడువు పెంచాలని రాష్ట్రం కోరడం మానదు

### మళ్లీ సిఎంఆర్ గడువు 30కి పెంపు

### రోజువారీగా సిఎంఆర్ బియ్యం సేకరణ మానిటరింగ్

### రేషన్ బియ్యం సిఎంఆర్ రూపంలో చెల్లించకుండా ఎఫ్‌సిఐ గట్టి నిఘా

**హైదరాబాద్, నవంబరు 7,ప్రభాతవార్త :** కస్టమ్‌మిల్లింగ్ బియ్యం బకాయిలు మిల్లర్లు చెల్లించరు రెవెన్యూ రికవరీ యాక్ట్ తీస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒవైపు హెచ్చరికలు చేస్తూనే మరోవైపు సిఎంఆర్ బియ్యం సేకరణ గడువు పెంచాలని సిఫార్సు చేయడం మానదు. రాష్ట్రంలో సిఎంఆర్ బియ్యం బకాయి పడ్డ వెయ్యికిపైగా మిల్లర్లు పౌరసరఫరాశాఖ, ఎఫ్‌సిఐ అధికారుల తనిఖీలకు హెచ్చరికలకు భయపడకుండా తమ వ్యాపారం వారు చేసుకొని పోతూనే ఉన్నారు. రాష్ట్రప్రభుత్వంకు రావాల్సిన 16వేల కోట్ల విలువ గల బియ్యం విక్రయించుకొని మిల్లర్లు జల్సాలు చేస్తూ ఉన్నారు. 2023-24 ఖరీఫ్,రబీ సీజన్ సిఎంఆర్ పెట్టని మిల్లర్లకు నవంబరు 30 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు పెంచింది. గత నెల 31 వరకు ఉన్న గడువు మరో 30రోజులు పెంచింది. రాష్ట్రప్రభుత్వం కూడా మిల్లర్లను అదిచేస్తాం ఇదిచేస్తాం అంటూ హెచ్చరికలు చేసినా చివరకు వారికి అనుకూలంగా కేంద్రంను రాష్ట్రంలో సిఎంఆర్ బియ్యం సేకరణకు నవంబరు వరకు గడువు ఇవ్వాలని కోరింది. కేంద్రంలోని బిజెపి సర్కార్ కూడా రాష్ట్ర ప్రభుత్వ వినతికి సానుకూలంగానే స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా సిఎంఆర్ బియ్యం త్వరగాసేకరించాలని ఎఫ్‌సిఐ అధికారులు సిఎంఆర్ బకాయి ఉన్న మిల్లులలో తనిఖీలు నిర్వహించారు. అంతేకాదు ఎఫ్‌సిఐ అధికారులు సిఎంఆర్ బకాయిలు చెల్లించని సుమారు 34శాతం మిల్లులపై గట్టి నిఘా ఉంచారు. నిబంధలకు అనుగుణంగా బియ్యం నిల్వలు ఉండేలా చూస్తున్నారు.

అంతేకాదు రేషన్‌బియ్యం రీసైకిలింగ్ చేసి సిఎంఆర్ కు రాకుండా అన్ని పరీక్షలు చేస్తున్నారు. రేషన్‌బియ్యం తిరిగి ఎఫ్‌సిఐ గోదాములకు రాకుండా అన్ని పరీక్షలు చేయాలని తాజాగా ఆదేశాలు క్షేత్ర స్థాయిలో ఎఫ్‌సిఐ అధికారులకు అందాయి. ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన ధాన్యంను సిఎంఆర్ బకాయిలేని మిల్లర్లుకు మాత్రమే ప్రస్తుతం ఇస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా ఇక సిఎంఆర్ బకాయిలు ముందుముందు తలెత్తకుండా బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకుధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. ఒక సీజన్‌కు సంబందించిన బియ్యం బకాయిలు 791 మిల్లులు, రెండు సీజన్ల సిఎంఆర్ బకాయి ఉన్న మిల్లులు 292 మూడు సీజన్లకు చెందిన బియ్యం ఇవ్వని వారు 74 మిల్లులు, నాలుగు సీజనల్లకు మించి బకాయిలు 20 మిల్లుల ఉన్నాయి. మొత్తంగా 1178 పైగా మిల్లులు సిఎంఆర్ బకాయిలు ఇవ్వకుండా తప్పించుకొంటున్నాయి. ఈ సారి గడువు తేదిలోగా బియ్యం వసూలు చేసేందుకు రోజువారి లక్ష్యాలు సేకరణకు ఏర్పాటు చేసుకున్నారు.

మిల్లులలో ధాన్యం ఉన్నదని ఇటీవల ఎఫ్‌సిఐ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ గడువు పెంచారు. రాష్ట్రంలో మిల్లర్లు, బిడ్డర్లు తోడుదొంగల్లా మారడంతో ఏకంగా 16వేల కోట్ల రూపాయల ధాన్యం మిల్లుల గడప దాటి ప్రభుత్వరంగసంస్థ ఎఫ్‌సిఐని చేరడంలేదు. రెవెన్యూరికవరి యాక్ట్ పెట్టినా ఫలితంలేదు. దీనితో కొత్తనిబంధనలను తెరలపైకి తెచ్చారు.



గురువారం గోవాలో డే ఎట్ సీ కార్యక్రమంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌పై రాష్ట్రపతి ముర్ము

# పంటల ఆరబోతతో ప్రాణాంతకంగా రహదారులు

## ఉసురుతీస్తున్న ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్ అధికారుల ఉదాసీనత

## రోడ్డుపై కల్లాలతో యేటేటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** ప్రాణాంతకంగా రహదారులపై పంటల ఆరబోత మారింది. రైతులు తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ రహదారుల నుంచి మొదలుకొని మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులు అనే తేడా లేకుండా రోడ్లను పెద్దపెద్ద రాళ్లుపెట్టి ఆక్రమించి వాటిపైనే పంటల నూర్పిడి చేసి అక్కడే ఆరబోస్తుండటంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతున్నది. 2014 ఏప్రిల్ 24న అర్ధరాత్రి రోడ్డుపై వరిధాన్యం పంటను ఆరబోయడంతో వైఎస్ఆర్‌సిపి నాయకురాలు శోభానాగిరెడ్డి ప్రయాణి స్తున్న కారుకు ప్రమాదమై ఆమె మృత్యువాతపడ్డారు. ఆనాటి నుంచి ఇలాంటి వార్తలు పంటనూర్పిడి సమయంలో వినడం సర్వసాధారణంగా మారుతున్నా ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోవడంలేదు. గత సంవత్సరం లక్ష్మణచాందా మండలంలో ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ మొక్కజొన్న రోడ్డుపై ఆరబోయడంతో బండి పట్టుతప్పి 2022 నవంబర్ 6న మృత్యువాత పడ్డారు.

ఈ సంవత్సరం కూడా అలాంటి మరణాలు మళ్లీ మొదలైనాయి. శనివారం సాయంత్రం మెదక్ జిల్లాలో మరోసారీ ఇదే తరహా ప్రమాదం జరిగి నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మనోహరాబాద్ మండలం పోతారం వద్ద రోడ్డుపై స్థానిక రైతులు ధాన్యం ఆరబోయడంతో ఒకేవైపు నుంచే వాహనాలు రాకపోకలు జరుగుతండగంలో ఎదరుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్ళుతున్న దంపతులు వారి ఇద్దరి పిల్లలు సంఘటనా స్థలంలో ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ వ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణ పెరుగుతుండటంతో రైతులు రోడ్లపైనే వరి,మొక్కజొన్న మిరప వంటి ఉత్పత్తులు ఆరబోస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, వరి నూర్పిడి జరగుతుండటంతో అవి అన్ని రోడ్లను ఆక్రమించాయి.

ఆదిలాబాద్ నుంచి మొదలు కొని అలంపూర్ వరకు ఇటు ఇందూరు నుంచి ఖమ్మం వరకు ఎక్కడైనా రోడ్లను ఆక్రమించి రైతులు వారి దిగుబడిని నూర్పిడి చేసి అక్కడే ఆరబెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో సింగిల్ రోడ్లు మాత్రమే ఉండటంతోపాటు అనేక బ్లైండ్ టర్నింగ్,హైయిర్‌పిన్ టర్నింగ్ లతో రోడ్లు వుంటాయి. రహదారులపై సగబాగం ధాన్యం పోయడంతో ఆకస్మికంగా ఒక్క సారి ధాన్యం కుప్పలు కనపడటంతో ఆకస్మికంగా బ్రేకులు వేసి పడిపోయి తీవ్రంగా గాయపడుతున్నారు. ఇలా గాయాలపాలయ్యే వారు ద్విచక్రవాహనదారులు, త్రిచక్రవాహనదారలు అత్యధికంగా ఉంటున్నారు. రాత్రి సమయంలో సగం రోడ్లు పై ధాన్యం ఆరబోయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనపడటంలేదు. నేషనల్‌హైవేలు, స్టేట్‌హైవేలలో లారీ డ్రైవర్లు విశ్రాంతికి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలు చాలావరకు రైతులు ధాన్యం నూర్పిడి చేసి పంటలు ఆరబెట్టుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదలు కొని కర్నూల్ వరకు 44వజాతీయ రహదారిపై కూడా పంటలు నూర్పిడి చేసి పెద్దపెద్ద బండరాళ్ళు రోడ్డుపై రైతులు పెట్టుకొంటున్నా రైతులను నివారించడంలేదు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్,కామారెడ్డిజిల్లాలో అత్యధిక భాగం రోడ్లపైనే ఆరబెడుతున్నారు. రాత్రి సమయాల్లో ఏలాంటి సూచికలు లేకపోవడంతో వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కరీంనగర్ మానకొండూర్ జమ్మికుంట రోడ్డుపై తీవ్రంగా వరిధాన్యం కుప్పలు పోయడంతో ఆరోడ్డుపై ప్రయాణం చేయడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హుజురాబాద్ చెల్పూరు ఇల్లంతకుంట, అంబాల, వంగపల్లి కమలాపూర్ మీదుగా హన్మకొండకు వెళ్ళే దారి అదే విధంగా సనుగుల పొత్కపల్లి, కాల్వాశ్రీరాంపూర్ మీదుగా పెద్దపల్లి రామగుండం వెళ్ళేదారిలో వరిధాన్యం కుప్పలు పోయడంతో ఇబ్బందులు పడటం సర్వసాధరారణంగా మారింది, నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి, భీమ్‌గల్, ముప్కాల్ బాల్కొండ ధర్మారావుపేట, సదిశవనగర్ చిట్యాల నుంచి నిర్మల్ తాంసి గుడిహత్నూర్,సీతాగోంది, తూప్రాన్,చేగుంట, రామయంపేట, డిచ్‌పల్లి, ఆర్మూర్, మామిడిపల్లి, కుప్టీ తదితర గ్రామాలలో రోడ్లపైనే ఆరబోస్తున్నారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వెళ్ళే రహదారిపై కూడా ఇదే పరిస్థితి ఉంది. పిఆర్,ఆర్అండ్‌బి,మార్కెటింగ్ రోడ్లను నిర్వహించే అధికారులు కూడా ఉదాసీనంగా ఉండటంతో ప్రయాణీకుల ఉసురుతీస్తున్నది.

